# ఎన్నికల్లో వీరి సేవలు అమూల్యం..

## ఎన్నికల ఏర్పాట్లలో పంచాయతీ కార్యదర్శులు,,



**పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్ ఏర్పాటు చేసిన జీపీ కార్యదర్శులు**

అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లకు వీఆర్వోలు, వీఆర్ఏలు లేకపోవడంతో ఎన్నికల ఏర్పాట్ల భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. పోలింగ్ స్టేషన్లను శుభ్రం చేయించడంతో పాటు లైటింగ్, భోజన సదుపాయం, తాగునీరు, టెంట్, ఫర్నీచర్ ఏర్పాటు బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులే చూసుకున్నారు. వారం ముందు నుంచే పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద సకల సౌకర్యాలు చేయడంతో ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించారు.

కోటపల్లి, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు అమూల్యమైన సేవలు అందించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు, వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ఏర్పాట్లు చేసేందుకు వీఆర్వోలు, వీఆర్ఏలు లేకపోవడంతో ఈ ఎన్నికల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రముఖ పాత్ర పోషించగా, ఓటర్లకు సేవలు అందించడం, పరిశుభ్రత కార్యక్రమాల్లో పంచాయతీ పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు. వారం ముందు నుండే బూత్ లెవల్ పోలింగ్ ఆఫీసర్స్ పోల్ చిట్టీలను ఇంటింటికీ తిరిగి పంచడంతో పాటు పోలింగ్ జరుగుతున్నంతవరకు అక్కడే ఉండి పోల్ చిట్టీలు తీసుకోనివారికి పోల్ చిట్టీలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది కూడా ప్రతి పోలింగ్ బూత్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు. చెన్నూర్ నియోజకవర్గంలో మొత్తం 227 పోలింగ్ బూత్‌ల ద్వారా 150754 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా వీరికి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## పోల్ చిట్టీల పంపిణీలో బీఎల్వోలు..



ఓటు వేసేందుకు అవసరమైన పోల్ చిట్టీలను బీఎల్వోలు ఎన్నికలకు రెండు రోజుల ముందే ఇంటింటికీ తిరిగి పోల్ చిట్టీలను పంపిణీ చేశారు. ప్రతి ఓటరుకూ పోల్ చిట్టీలు అందించడంతో పాటు పోల్ చిట్టీలు రాని ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రం వద్ద సహాయ కేంద్రం ఏర్పాటు చేసి పోల్ చిట్టీలను అందజేశారు. ఓటరు జాబితా సవరణలోనూ బీఎల్వోలు ముందునుండే చాలా కష్టపడ్డారు.

## పరిశుభ్రతలో పంచాయతీ కార్మికులు..



ఎన్నికల సందర్భంగా పారిశుధ్య కార్మికులు ప్రముఖ పాత్ర పోషించారు. పోలింగ్ కేంద్రాలను శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచారు. ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రతి పనిలో తామై వ్యవహరించారు. ఓటు వేయడానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులను వీల్ చైర్‌లో తీసుకువచ్చి, తీసుకువెళ్లే వరకు అన్ని పనులు చూసుకున్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు..



**వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది**

ఎన్నికల సందర్భంగా ఓటర్ల సౌకర్యార్థం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. ఓటర్లకు అనారోగ్య సమస్య తలెత్తితే వెంటనే వైద్య చికిత్స అందించారు.

# ఎవరి ధీమా వారిదే..

- ఓట్ల లెక్కల్లో మునిగి తేలుతున్న అభ్యర్థులు
- ఎక్కడ చూసినా గెలుపోటములపై ప్రజల చర్చలు

తాండూర్, డిసెంబర్ 2 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో జిల్లా లోని ప్రధాన పార్టీల అభ్యర్థులు లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. జిల్లాలోని అభ్యర్థులంతా పేపరు, పెన్నులు పట్టుకొని పోలింగ్ ఏజెంట్లతో సమావేశమై ఈవీఎంలలో ఉన్న ఓట్లను తమకు ఎన్ని పడ్డాయో చర్చించుకుంటున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో అభ్యర్థులు పెట్టిన ఖర్చులు, వారికి పడిన ఓట్ల లెక్కలు చూసుకుంటుండగా ప్రజలు మాత్రం ఎన్నికల్లో ఎవరు గెలవబోతున్నారనే దానిపై ఎక్కడ చూసినా చర్చలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొంతమంది అభ్యర్థులైతే తాము పెట్టిన ఖర్చు లెక్కలు వేసుకొని గుండెలు బాదుకుంటూ తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. నామినేషన్లు వేసిన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రచారాలు, మైకులు, జెండాలు, కండువాలు ఇలా ప్రతిదానికీ చేసిన ఖర్చులతో పాటు చివరి అంకంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇచ్చిన డబ్బుల లెక్కలు చూసుకుంటున్నారు. కొంతమంది అభ్యర్థులు 20 నుంచి 40 కోట్లు ఖర్చు చేయగా ఒకరిద్దరైతే రూ.50 కోట్ల మార్క్ దాటినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ మేరకు ఓట్లు పడలేదని లెక్కలు వేసుకొని గుండెలు బాదుకునే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ముందస్తుగానే ఎన్నికల కోసం డబ్బు జమ చేసి పెట్టుకోగా రోజురోజుకు వ్యయం పెరుగుతూ రాగా ఒకరిద్దరు తెలిసిన వారి నుంచి దొరికిన కాడికి అప్పులు తెచ్చారు, మరి కొందరు అభ్యర్థులైతే వేల కోట్లలో పెద్ద మొత్తంలో డబ్బులున్న పెత్తందార్లే. ఇప్పుడు ఎంత ఖర్చు అయిందో లెక్కలు చూసు కుంటూ అనుకున్న దానికి రెండింతలు పెరిగిందని తెలిసి పలువురు అభ్యర్థులు కండ్లు బైర్లు గమ్మే స్థితికి వచ్చినట్లు తెలుస్తుంది. ఇలాంటి అభ్యర్థులు జిల్లాలో ఇద్దరు ముగ్గురు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే అభ్యర్థులు మాత్రం ఎవరికి వారే 10 నుంచి 15 వేల



ఓట్ల మెజార్టీతో గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎక్కడ గుమిగూడినా ఆ అభ్యర్థికి అంత సీన్ లేదు.. అన్ని ఓట్లు పడవని, పలానా అభ్యర్థి గెలువడం ఖాయమని చర్చించుకుంటూ చాలెంజ్‌లు చేస్తున్నారు.

**ఏ నలుగురు కలిసినా.. ఆ ముగ్గురి ముచ్చటే..**

శాసనసభ ఎన్నికలు గురువారం పూర్తికాగా.. ఎక్కడ చూసినా ఎవరు గెలవబోతున్నారనే దానిపైనే చర్చలు చేస్తున్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లో బరిలో నిలబడ్డ అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓటమి పాలవుతారంటూ చర్చించుకుంటున్నారు. ఒక ప్రాంతం వారు మరో ప్రాంతానికి ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. బెల్లంపల్లిలో సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ నుంచి గడ్డం వినోద్, బీజేపీ తరపున అమరాజుల శ్రీదేవి ప్రధాన పోటీదారులుగా ఉండగా.. వీరిలో ఎవరు గెలుస్తున్నారనే దానిపై విపరీతమైన చర్చ జరుగుతున్నది. ఏ పార్టీకి ఎంత బలం ఉన్నది.. ఏయే వర్గాలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపాయి? అనేదానిపై పెద్ద ఎత్తున చర్చ వినిపిస్తున్నది. బెల్లంపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ నలుగురు గుమి గూడినా ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్న ఈ ముగ్గురి గురించే మాట్లాడుకుంటున్నారు. చివరి నిమిషంలో ఓ అభ్యర్థి కోట్లు పెట్టి ఓట్లు కొనుగోలు చేశాడట అని ఒకరంటే.. తండాలు, గ్రామాల్లో ఒక్కో ఓటుకు రూ. 500 నుంచి రూ.వెయ్యి వరకు ఇచ్చారనే చర్చ వినిపిస్తున్నది. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఏ అభ్యర్థి ఎన్ని కోట్లు ఖర్చు చేశారు.. ఎవరు గెలవబోతున్నారు? ఏ మండలంలో ఎవరికి మెజార్టీ రాబోతున్నదనే దానిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. మరి ఎవరి అంచనాలు నిజమవుతాయో తేలాలంటే మరి కొద్ది గంటలు వేచి చూడాల్సి ఉంది.

## బాల్క సుమన్ భారీ మెజార్టీతో గెలవాలని పూజలు



**పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బండారి సత్యనారాయణ**

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ అధిక మెజారిటీతో గెలవాలని కోరుతూ చెన్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బండారి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల లెక్కింపు నేడు మంచిర్యాలలో జరుగుతున్న సందర్భంగా రెండవ సారి చెన్నూర్ నియోజక వర్గ ఎమ్మెల్యేగా బాల్క సుమన్, మూడవ సారి సీఎంగా కేసీఆర్ కావాలని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్, కూడా ఉండదని తెలిపారు. సామాన్య ప్రజలు బతకడం చాలా ఇబ్బంది అవుతుందని మాట్లాడారు.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



**పోస్టల్ సేవల పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌పీ రామారావు**

కోటపల్లి, డిసెంబర్ 2 : పోస్టల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ రామారావు సూచించారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి, కొల్లూరు, బబ్బెరచెలుక గ్రామంలో పోస్టల్ సేవలపై మేళాను నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోస్టాఫీసులో డబ్బులు పొదుపు చేయడం ద్వారా ఆర్థిక భద్రత లభిస్తుందని వివరించారు. పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న బీమా పథకం వివరాలను వివరించారు. రూ.399తో రూ.10 లక్షల బీమా పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవో శ్రావణ్, బీపీఎం టీ సమ్మాగౌడ్, స్వప్న, మోబిన్, జగదీశ్, భీమిని రాజాగౌడ్, పంచాయతీ కార్యదర్శి గోదారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ పీఆర్టీయూ మండల శాఖ ఎన్నిక

భీమారం, డిసెంబర్ 2 : టీఎస్ పీఆర్టీయూ మండల శాఖను శనివారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గుడిమల్ల నరేందర్. ప్రధాన కార్యదర్శిగా ఆసంతుల రవీందర్లను జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విక్రమ్ కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బిల్లా తిరుపతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ. శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పీ. వేణుగోపాల్, వెంకటేశ్వరరావు. షరిక్, తిరుపతి. జోడు మధు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా భుజంగం



**బాధ్యతలు స్వీకరిస్తున్న భుజంగం**

బెల్లంపల్లి, డిసెంబర్ 2: బెల్లంపల్లి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా భుజంగం శనివారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన సమ్మయ్య దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. దీంతో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న భుజంగానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.